క్లుప్తంగా

కీసరలో స్వామివారి పల్లకీ సేవ



కీసర: శ్రావణమాస సోమవారం సందర్భంగా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గర్భాలయంలోని స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అనంతరం అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవ, ఊరేగింపు చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

ఆకట్టుకున్న 'మ్యాజిక్ టూర్'

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ పానీయాల తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ తమ 'స్టెర్లింగ్ రిజర్వ్ బీ7'ని సిటీ మార్కెట్లో విడుదల చేసింది. ఈ సందర్భంగా బీ7 'మ్యాజిక్ టూర్'ను నగరంలోని దర్బార్ రెస్టారెంట్‌లో నిర్వహించింది. 'సో స్మూత్, మస్ట్ బి మ్యాజిక్' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిజిటల్ స్టోరీ టెల్లింగ్ సెషన్స్‌తో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్ మీటప్ కూడా నిర్వహించారు. ఆర్జే సూర్య, పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్లు, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసరలో సోమవారం స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తడి, పొడి వ్యర్థాల వేరు చేయడం, సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



శామీర్‌పేట్: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని గాయత్రి మహాక్షేత్రంలో రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎల్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వామివారి ఆరాధన ఉత్సవాల్లో సోమవారం ముఖ్యమైన రోజని, స్వామివారు బృందావనం నుంచి బయటకు వచ్చి భక్తులకు ఆశీస్సులు అందించిన రోజని చెప్పారు. మండల భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సందీప్

ఘట్‌కేసర్: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ఆర్ తోట, వరంగల్‌కు చెందిన అడపా సందీప్ (28), తల్లి అడపాలతతో కలిసి నగరంలోని మాదన్నపేటలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 7న కుటుంబ కలహాల కారణంగా భార్యతో గొడవపడ్డాడు. ఫోన్‌ను ఇంట్లో పెట్టి కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీలో దరఖాస్తుల ఆహ్వానం

కుషాయిగూడ: కుషాయిగూడలోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బోధన సిబ్బంది నియామకానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య కళాశాలలో బోధించేందుకు అసోసియేట్ ప్రొఫెసర్లు (4), అసిస్టెంట్ ప్రొఫెసర్లు (7), ట్యూటర్లు (5), సీనియర్ రెసిడెంట్లు (7) పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు ప్రభుత్వ వైద్య కళాశాల సీడీఎస్ అకౌంట్ పేరుపై రూ. 1000 డీడీ చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18న ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు సమీపంలోని సువిధ ఆస్పత్రి పక్కన ఉన్న కుత్బుల్లాపూర్ మెడికల్ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవకళ్యాణి 98492 30566.

చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఆకస్మిక తనిఖీ



అంకిరెడ్డిపల్లిలో రెసిడెన్షియల్‌లో విద్యార్థులతో కలెక్టర్ మనుచౌదరి

కీసర: విద్యార్థులు విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కష్టపడి చదువుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితం, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులపై బోధించి, స్టాక్ మార్కెట్, బ్యాంకింగ్, షేర్స్, టెక్నాలజీ అనాలసిస్, ఫండమెంటల్ అనాలసిస్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న వారికి మార్గనిర్దేశం..

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు మార్గనిర్దేశం, మెటీరియల్‌ను అందించడమే కాకుండా వారికి సలహా, సూచనలు అందిస్తానన్నారు. దీనికి కలెక్టర్ మెయిల్ ఐడీని విద్యార్థులకు ఇచ్చారు. స్కూల్, జూనియర్ కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల భోజనంపై ఆరా..

మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా..? అని ఆరా తీశారు. కీసర తహసీల్దార్ అశోక్, ప్రిన్సిపాల్ రాజమణి, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజల నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన స్వీకరించారు. అక్రమ కట్టడాలు, పరిశ్రమల స్థాపనకు భూసేకరణలో భాగంగా తీసుకున్న పట్టా భూములకు నష్టపరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులతో సహా మొత్తంగా 71 ఫిర్యాదులను ప్రజావాణిలో కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి, వారి సమస్యలను పరిష్కరిస్తామన్న నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను తగిన కారణాలను తప్పనిసరిగా పేర్కొంటూ.. అర్జీదారులకు తెలపాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలన్నారు.



జూనియర్ కళాశాలలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్

పరిశ్రమలకు ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఘట్‌కేసర్ మండలం మాదారంలో పరిశ్రమ స్థాపనకు భూసేకరణలో భాగంగా తీసుకున్న తమ భూములకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన కార్యక్రమం నిర్వహించి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల క్రితం మాదారంలో పరిశ్రమల స్థాపనకు 85 మంది రైతుల నుంచి 285 ఎకరాల పట్టా భూములను ఎకరానికి రూ.32.50 లక్షల ధర నిర్ణయించి తీసుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సేకరించిన 285 ఎకరాల భూములకు సంబంధించి ఇప్పటి వరకు 252 ఎకరాలకు మాత్రమే సంబంధిత రైతులకు నష్ట పరిహారం అందజేశారని వారు పేర్కొన్నారు. మిగతా 15 మంది రైతులకు సంబంధించి 33 ఎకరాల భూములకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ , మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గంట సేపు ఆందోళన చేపట్టిన రైతులు కలెక్టర్ మనుచౌదరితో సహా జిల్లా అదనపు కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులను కలిసి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నారు. సకాలంలో పరిహారం అందకపోవటంతో పిల్లల పెళ్లిళ్లు వాయిదా పడుతున్నాయని పేర్కొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాలని వినతి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వజ్రేష్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో ఎదుర్కొంటున్న ముంపు సమస్యను పరిష్కరించాలని తోటకూర వజ్రేష్‌యాదవ్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించి తక్షణమే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎండీ ఆదేశాలు జారీ చేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పాపయ్యకాలనీలో ఎన్నో ఏళ్లుగా ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ కార్మికుల 2 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పురపాలక సంఘాల్లో విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు 2 నెలల జీతాలు ఇప్పటికీ రాలేదని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. విలీనమైన గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల బకాయి కూడా వెంటనే అందజేయాలన్నారు. బకాయిలతో కలిపి కార్మికులకు 5 నెలల జీతాలు ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తాకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు జీతాలు ఈ వారంలో చెల్లిస్తామని ఆమె హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికష్ణ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ప్రశాంత్, బిక్షపతి, మల్లయ్య, శీను, బాల్కొండ పాల్గొన్నారు.

'లీడ్ అకాడమిక్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు తదితరులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో సోమవారం విద్యలో సమూల మార్పులను పెంపొందించడం అనే అంశంపై లీడ్ అకడమిక్స్ నైపుణ్యత కలిగిన ప్రొఫెసర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ లీడ్ అకాడమిక్స్‌పై బిట్స్ పిలానీలో 6 రోజుల పాటు సదస్సు ఉంటుందని వివరించారు. అనంతరం బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు, డైరెక్టర్ సౌమ్యముఖర్జీ, మాజీ వైస్ చాన్స్‌లర్ జితేంద్రనాథ్ జైన్, ఐఐటీ హైదరాబాద్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉదయ్‌దేశాయ్, ఐఐటీ గాంధీనగర్ మాజీ డైరెక్టర్ సుధీర్‌జైన్‌లు లీడ్ అకాడమిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విజయపురి నూతన కాలనీ కార్యవర్గం



కార్యవర్గ సభ్యులను సత్కరించిన కాలనీవాసులు

పోచారం: చౌదరిగూడలో విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షుడిగా దోర్నాల సంతోష్, ఉపాధ్యక్షుడిగా రాజురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భానుకుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రకాష్ రెడ్డి, కోశాధికారిగా గడ్డం నరేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేష్, కార్యవర్గ సభ్యులుగా శంకర్, ప్రవీణ్, పవన్, బిక్కునాయక్, సురేష్, శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా షేక్ మీరా, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, దిగంబర్ వ్యవహరించనున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీవాసులు శాలువాలతో సత్కరించారు.

పన్ను వసూళ్లు, మౌలిక సదుపాయాలపై సమీక్ష

శామీర్‌పేట్: ఇంటిపన్ను వసూళ్లు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తుంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి సూచించారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్, టౌన్ ప్లానింగ్ అంశాలు, శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై వార్డు ఆఫీసర్లకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఇతర పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



లావణ్య, వ్యవసాయాధికారి

ఘట్‌కేసర్: జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు వచ్చిన రైతులు, ఇప్పటి వరకు రైతుబీమా పొందని వారు ఆగస్టు 13లోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. ఆగస్టు 14, 1966 నుంచి 14 ఆగస్టు, 2007 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, తహసీల్దార్ డిజిటల్ సంతకంతో చేసిన డీఎస్ పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్‌కార్డులో 18–59 ఏళ్లున్న రైతులు మాత్రమే బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు ఇంటిపై గోడ ధ్వంసం



కీసరలో పిడుగుపాటుకు గురైన ఓ ఇంటిపైన గోడ

కీసర: వర్షం కారణంగా కీసర చౌరస్తాలో మోహన్ లాల్ అనే వ్యక్తి ఇంటిపై అంతస్తుపై పిడుగు పడింది. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఉరుములు, మెరుపుల వర్షం కారణంగా ఒక్కసారిగా పిడుగు పడటంతో పెద్ద శబ్దం వచ్చింది. పిడుగుపాటుకు భవనంపై అంతస్తులోని పిటగోడ కొద్దిభాగం కూలిపోయి పక్కనే ఉన్న విద్యుత్ వైర్ల మీద పడటంతో పెద్ద శబ్దం వచ్చింది. బయటికి వచ్చిన కుటుంబసభ్యులు పిడుగు పడినట్లు గుర్తించారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భేతిసుభాష్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణగౌడ్, యాదగిరిగౌడ్, కైలాసపతిగౌడ్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌పటేల్ పాల్గొన్నారు.

దేశ ప్రజలంతా ఏకం కావాలి

మేడ్చల్,గుండ్లపోచంపల్లిలో తిరంగా ర్యాలీ



మేడ్చల్‌లో తిరంగా ర్యాలీలో నాయకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ పట్టణంలో మున్సిపల్ అధ్యక్షురాలు శైలజహరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ నేతలతో కలిసి పాల్గొన్నారు. దేశభక్తిని చాటేలా 75 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకంతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. నాయకులు ప్రేమ్‌దాస్, వంశీ, రాజు, శ్రీకాంత్, అర్జున్, ప్రభాకర్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, అనిత, శోభారెడ్డి, నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

– గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతి, నాయకులు కృష్ణ, శ్రీకాంత్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ

కీసర: నాగారం మున్సిపాలిటీ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నాగారం శ్రీ చైతన్య స్కూల్ వద్ద ×హర్ ఘర్ తిరంగా౯ ర్యాలీ నిర్వహించారు. సోమవారం నాగారం మున్సిపాలిటీలోని పలు కాలనీలో దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ కాలనీ అసోసియేషన్లు, యువజన సంఘాలు, మహిళాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



స్ట్రోమ్ వాటర్ డ్రైయిన్ లైన్ పరిశీలన



కాప్రా చెరువు వద్ద కార్పొరేటర్ స్వర్ణరాజ్, అధికారులు

కాప్రా: కాప్రా చెరువును కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సందర్శించారు. చెరువుకు నిర్మించిన స్ట్రోమ్ వాటర్ డ్రైయిన్ లైన్ పనితీరును సంబంధిత అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షపునీటి మళ్లింపునకు స్ట్రోమ్ వాటర్ డ్రైయిన్ వ్యవస్థను చేపట్టామని, ఈశ్వరిపురి, హైటెన్షన్ రోడ్డు నుంచి 2 లైన్లు, క్లాసిక్ ఎన్‌క్లేవ్ నుంచి ఒక లైన్ నిర్మించామని పేర్కొన్నారు. దీంతో వర్షపునీరు చెరువులోకి వస్తుందని, రోడ్లపై నీరు నిల్వకుండా నేరుగా చెరువులోకి వరద నీరు వస్తుందన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు మొదలుపెట్టాలి..

వినాయక చవితి పండగను దృష్టిలో పెట్టుకుని కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సూచించారు. గణేష్ నిమజ్జనం సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెరువు వద్ద, కొలనులో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కుషాయిగూడ పోలీసు సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలి

గురుకుల స్కూళ్లలో భోజన టెండర్ల మార్పు



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కాప్రా: గురుకుల స్కూళ్లలో విద్యార్థులకు అందించే భోజన మెనూ టెండర్లలో నూతన విధానం కాకుండా పాత పద్ధతినే కొనసాగించాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ సరఫరా చేసే టెండర్ విధానాన్ని మార్చారని, కొత్త టెండర్ విధానాన్ని అనుసరించే ఆర్థికస్తోమత తమకు లేదని వాపోయారు. టెండర్ విధానంలో మార్పుల కారణంగా వందల కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈనెల 13 నుంచి సరఫరా నిలిపేస్తున్నామని తేల్చి చెప్పారు. కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ వ్యవస్థాపకులు మల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి సోమవారం మున్సిపల్ పరిధిలోని మునీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. వసంతలత, అభినవ్‌రెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపకులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

లో ప్రెషర్ సమస్యపై వినతి

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లో కొద్ది నెలలుగా పలు బస్తీ నల్లాల్లో వచ్చే తాగునీటి సరఫరాలో సన్నటి ధారగా వస్తోందని ప్రజావాణిలో జలమండలి జీఎంకు స్థానికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ స్పందిస్తూలో ప్రెషర్‌గా తాగునీటి సరఫరాలో వస్తున్న మాట వాస్తవమేనని, త్వరలోనే తాగునీటి సరఫరా సమయాన్ని కూడా పెంచి ప్రెషర్ పెంచుతామని హామీ ఇచ్చారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి శివకుమార్ తదితరులున్నారు.

బంజారాల సంప్రదాయ ప్రతిబింబమే తీజ్

కాకతీయనగర్ కాలనీలో ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ ముగింపు వేడుకల్లో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి

మేడిపల్లి: తరతరాలుగా బంజారా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే తీజ్ పండుగ ఉత్సవాలు పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేడిపల్లి కాకతీయనగర్ కాలనీలో తీజ్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈనెల 1న తీజ్ ఉత్సవాలు ప్రారంభం కాగా ఆదివారం సాయంత్రం ఊరేగింపుతో ముగిశాయి. వేడుల్లో భాగంగా మొదటిరోజు సేవాలాల్ మహరాజ్, మేరామాయాడి సన్నిధిని ఏర్పాటు చేసుకుని 9 రోజుల పాటు నిష్టతో సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఆచారం ప్రకారం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో మహిళలు లయబద్ధంగా చేసిన బంజారా సాంస్కృతిక నృత్యాలు, ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. తీజ్ ఉత్సవ వేడుకలకు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, కాలనీ ప్రతినిధి భాగ్యశంకర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శ్రీలతభద్రునాయక్, దేవివిజయ్, నిర్మల శంకర్, సుజాత తారాసింగ్, బానోత్ సుజాత, సుధాకర్, జ్యోతిమంగ్లీలాల్, గిరావత్ స్వరూప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.